క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

విజయపురం(వడమాలపేట): వడమాలపేట మండల కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

ఏడు సమస్యలపై వినతులు



వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మండల తహసీల్దార్ లోకనాథ పిళ్లై అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో నెలకొన్న భూ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అందులో మ్యుటేషన్ 03, భూ సర్వే 02, రహదారి ఏర్పాటు 02 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

రేపటి నుంచి పారిశుధ్య పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని 32 పంచాయతీల పరిధిలో మంగళవారం నుండి పది రోజులపాటు సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో మురుగు నీటి వ్యవస్థను శుద్ధి పరచడం, తాగునీటి ట్యాంకర్లు క్లీనింగ్‌తోపాటు చివరి రోజు ఫాగింగ్ పనులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చేయాలని ఎంపీడీఓ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 147 మంచినీటి ట్యాంకులు ఉన్నాయని, ప్రస్తుతం 138 పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా పూర్తి స్థాయిలో శుద్ధి పరిచే కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ఎక్కడైనా పనులు చేపట్టకుంటే నేరుగా తనను సంప్రదించాలని ఎంపీడీఓ తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



సేంద్రియ ఎరువుతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి సేద్యంలో రైతులు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం వాసు తెలిపారు. సోమవారం క్రిష్ణమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు వేసి సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో డీపీఎం వాసు మాట్లాడుతూ వేరుశనగ పంట యూనివర్సల్ మోడల్ పరిశీలించడంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలను తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో వరిసాగు చేసి, అందులో వచ్చిన బియ్యం ఉపయోగించుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిచెన్ గార్డెన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణగిరిపై అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

పని బాట పట్టని కార్యదర్శులు

నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శుల పని తీరు చాలా విచిత్రంగా ఉంది. సచివాలయంలో ఉంటూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కారించాల్సిన బాధ్యత ఉన్నా... అదంతా పట్టనట్టు ఉదయం సచివాలయానికి హాజరై వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం గంట మోగితే మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా ఏవో కారణాలు చెప్పి, మండల కార్యాలయానికి చేరుకుంటున్నారు. అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపం చేసి ఇంటికెళ్తున్నారు. రూరల్ మండల కార్యదర్శులు పుత్తూరు, నగరి పట్టణాలకు చేరుకుని అక్కడ ఏదో ఒక టీ షాపు, దాబాల్లో కాలక్షేపం చేస్తూ ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. కొందరు కార్యదర్శులైతే రెండు క్యాష్‌బుక్‌లు నిర్వహిస్తూ, ఒక క్యాష్ బుక్‌లో అసలైన లెక్కలు, మరో బుక్‌లో వారికి కావాల్సినట్లుగా లెక్కలు వేసుకుంటున్నారు. – విజయపురం



పరమేశ్వర మంగళం సచివాలయం

- విధులకు ఇష్టారాజ్యంగా డుమ్మా
- మెరుపులా వచ్చి వెళ్తున్నారని ఆరోపణ
- క్యాష్ బుక్ నిర్వహణలో గోల్‌మాల్

నగరి నియోజకవర్గంలో మొత్తం 101 పంచాయతీలు, 78 సచివాలయాలు, 86 మంది కార్యదర్శులు పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది విధులకు డుమ్మా కొడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంట పాటు గ్రామ, సచివాలయంలో ఉంటున్నారు. మధ్యాహ్నం అయితే మండల కార్యాలయాలకు చేరుకుంటున్నారు. కొందరైతే సచివాయాలయానికి రావడం మానేశారు. ఏ సచివాలయానికి వెళ్లినా ఒకరు, లేదా ఇద్దరు తప్ప కార్యదర్శులు ఉండడం లేదన్న వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇది తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టణ, మండల కేంద్రంలో కాలక్షేపం

పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలకు అవుట్ అటెండెన్స్ విధిగా వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్ననికే వెళ్లిపోతున్నారు. మరి కొందరు మీటింగులు, వీసీలు, మండల కార్యాలయంలో పని ఉందంటూ, రకరకాల సాకులతో సచివాలయాల నుంచి మెల్లగా జారుకుంటున్నారు. కొందరు ఇంటికి వెళ్లిపోతే.. మరి కొందరు పట్టణ, మండల కేంద్రానికి వచ్చి సొంత పనులు చూసుకుంటున్నారు. ఇక వచ్చిన కొంత మంది కార్యాలయంలో కాలక్షేపం చేస్తున్నారు. తోచినప్పుడు బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. పల్లె సమస్యలను పట్టించుకోవడం లేదు.

పనివేళలో కానరారు

పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10 గంటలకు హాజరు వేయాలి. అయితే చాలా మంది 11 గంటలకు కూడా సచివాలయాలకు చేరుకోవడం లేదు. ఒక వేళ వచ్చినా గంటకు పైగా ఉండడం లేదు. దీన్ని అనువుగా తీసుకొని సచివాలయంలో పని చేస్తున్న చిన్న స్థాయి ఉద్యోగులు తామేమీ తక్కువ కాదంటూ, వాళ్లు కూడా బయట వెళ్లి కాలక్షేపం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలు అధికారులు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోతున్నారు.

మాదకద్రవ్యాలతో అనేక అనర్థాలు



డ్రగ్స్ అనర్థాలను వివరిస్తున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: మాదకద్రవ్యాల వాడకంతో అనేక అనర్థాలు సంభవిస్తాయని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. సోమవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం–దుష్పరిణామాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ యువత ప్రధానంగా వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నప్పటి నుంచే వ్యసనాలకు బానిస అయితే ఎన్నో దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రధానంగా గంజాయి, గుట్కా, ప్రభుత్వ నిషేధిత పదార్థాల వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకం ద్వారా జీవితాలు ఛిద్రమైపోతున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసికంగా, శారీరకంగా అవాంతరాలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. ఆరోగ్యవంతమైన జీవన శైలికి అలవాటు పడి భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

- రక్తదానం చేసిన పోలీసులు

నగరి: అమరవీరులకు నివాళులర్పించేందుకు నగరి పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరి, నగరి రూరల్, కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మహేశ్వర్, భాస్కర్, హనుమంతప్ప ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో అన్ని సర్కిళ్ల నుంచి 120 మంది పోలీసులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జరీనా శిబిరాన్ని పర్యవేక్షించగా పుత్తూరు హెచ్‌డీ బ్లడ్ బ్యాంకు వారు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నగరి సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ భారత జవాన్లు జమ్ముకశ్మీర్ రాష్ట్రం లడక్ జిల్లాలోని లేహ్ ప్రాంతంలో బందోబస్తులో ఉన్న సమయంలో చైనా సైనికులు వారిపై దాడి చేయడంతో 11 మంది మృతి చెందారన్నారు. వారి మృతదేహాలను తీసుకువచ్చే వీలు లేకపోవడంతో జవాన్ల మృతదేహాలను అక్కడే ఖననం చేశారన్నారు. కుటుంబీకులు వారి కడసారి చూపునకు సైతం నోచుకోలేదన్నారు. విధి నిర్వహణలో ఇలా పోలీసులు కూడా పలువురు మృతి చెందుతున్నారన్నారు. ఇలా అసువులు బాసినవారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రతి యేటా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుతామని తెలిపారు. ఈ ఏడాది రక్తదానం చేస్తూ వారికి నివాళులర్పించామన్నారు. శిబిరానికి విచ్చేసి రక్తదానం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. శిబిరంలో వైద్యులు కార్తికేయన్, స్పందన, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు

108 సిబ్బంది నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

గంగాధరనెల్లూరు: మండల వ్యాప్తంగా 108 సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. 108 సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో పస్తుల పాలవుతున్నామని, ఈఎంఐలు కట్టే పరిస్థితి కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమకు జీతాలు మంజూరు చేయాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వార్షిక ఇంక్రిమెంట్ చెల్లించడం లేదని, అలాగే వైద్య ఆరోగ్యశాఖలో అమలవుతున్న సదుపాయాలు ఏవీ తమకు వర్తించడం లేదని తెలిపారు. 108 వ్యవస్థలో కూడా రోజుకు మూడు సీట్లలో ఎనిమిది గంటల చొప్పున పని విధానాన్ని అమలు పరచాలని తెలిపారు. ఏఈఎంఎస్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు వేతన స్లాబ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీతో చర్చించి పరిస్థితులకు అనుకూలంగా తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది ప్రసాద్, చేతన్ బాబు, సందీప్, ప్రదీప్, చిట్టిబాబు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

- వ్యాపారం నిలిపేసిన ఏజెంట్లు
- బ్రాంచి కార్యాలయాల వద్ద ఆందోళన

పుత్తూరు: యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా దేశంలోనే అగ్రగామి జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పుత్తూరు బ్రాంచి ఏజెంట్స్ యూనియన్ సెక్రెటరీ ఎ.రుద్రీమోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బ్రాంచి కార్యాలయం వద్ద ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ ఏజెంట్లు వ్యాపారాన్ని నిలిపేశారని తెలిపారు. ప్రపంచంలోనే అగ్రగామి సంస్థల్లో రెండో స్థానంలో ఉన్న ఎల్ఐసీ మనుగడకు మూలస్తంభాలైన ఏజెంట్లపై యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 68 ఏళ్లగా ఏజెంట్లు తమ వృత్తి ద్వారా గ్రామ గ్రామాన దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ సేవలను విస్తరింపజేశారని తెలిపారు. ఒకే కమీషన్‌తో పనిచేస్తున్న ఏజెంట్ల తొలి ఏడాది కమీషన్‌ను తగ్గించడం అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. అలాగే పాలసీదారులకు బోనస్‌ను పెంచడం లేదని ఆరోపించారు. పాలసీపై లోన్ తీసుకొంటే 10 శాతం వడ్డీని వసూలు చేయడంతోపాటు జీఎస్టీని వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎల్ఐసీ మనుగడ కొనసాగాలంటే సమస్యలను యాజమాన్యం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆదోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేఎస్ఎం సుందరం, సుబ్రమణ్యం, సురేష్, మునిరాజ, పీఆర్‌సీ నాయుడు, దేవరాజులు, శివ, లోక, శ్రీనివాసనాయుడు, భాగ్యలక్ష్మీ, బాలు, వెంకటేష్, బుజ్జి, ఢిల్లీ, బాబు, హేమ, షణ్ముగం, కేశర్ధనయ్య, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్ల నిరసన

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఊరి బయట టపాసుల విక్రయాలు



స్థల పరిశీలన చేస్తున్న డివిజనల్ స్థాయి కమిటీ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఈ ఏడాది దీపావళి పండుగకు ఊరి బయట టపాసులు విక్రయించాలని నిర్ణయించినట్లు చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం డివిజనల్ కమిటీ సభ్యులు మురకంబట్టులో స్థల పరిశీలన చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో టపాసుల విక్రయాలు చేసేందుకు తాత్కాలిక లైసెన్సులను ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టపాసుల తాత్కాలిక లైసెన్సుదారులకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు స్థలం పరిశీలించినట్లు చెప్పారు. చిత్తూరు నగరానికి సరిహద్దులో మురకంబట్టు వద్ద ఉన్న సర్వే నెంబర్ 102 (ప్రభుత్వ భూమి)లో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజనల్ కమిటీ స్థల పరిశీలన తర్వాత వన్‌మన్ కమిటీ నివేదిక ప్రకారం అగ్నిమాపక శాఖ నియమాలను అనుసరించి తాత్కాలిక షెడ్లు వేసుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. గతంలో గుర్తించిన పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల మైదానం స్థలాన్ని రద్దు చేసి మురకంబట్టు వద్దకు మార్చినట్లు ఆర్డీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, నగరపాలక సంస్థ ఏసీపీ నాగేంద్ర, చిత్తూరు అర్బన్ ఆర్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక వేడుకల్లో కంచి పీఠాధిపతి



కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతికి తీర్థప్రసాదాలు అందిస్తున్న కాణిపాకం ఈఓ

కార్వేటినగరం(పెనుమూరు): పెనుమూరు మండలం కలికిరికొండ దిగువన శ్రీదేవి భూదేవి సమేత శ్రీమహా విష్ణుమూర్తి ఆలయ కుంభాభిషేకం వేడుకలకు కంచి కామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి కంచి పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికారు. కాణిపాకం దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్ స్వామివారి తీర్థప్రసాదాలు, వస్త్రాలను కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, బాలాజీ నాయుడు, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందజేస్తాం

గుడిపాల: మెరుగైన వైద్యం అందజేస్తామని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. 45మందికి పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, హైమావతి, సుమతి, గీతలు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం అయన శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయానికి పలు సమస్యలతో వచ్చిన వారితో స్నేహభావంతో మెలగాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యలోపం, దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రీన్‌అంబాసిడర్లు తాగునీటి ట్యాంకులను శుభ్రంగా చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పాలసముద్రం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి


తవణంపల్లె: గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ సమాచార చట్టంపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మల్లకుంటలో సోమవారం ప్రజలకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే చట్టాల గురించి ముఖ్యంగా తెలుసుకోవాలన్నారు. ప్రజలకు సమాచార చట్టంలో సందేహాలను నివృత్తి చేశారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వినయకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు రకహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, గుడ్లు, చిక్కీలు తప్పక భుజించాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో కాంచి చల్లార్చిన నీరు తాగాలని వివరించారు. అప్రమత్తతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో సమస్యల తిష్ట

గుడిపాల: బాలిక హాస్టల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఎస్సీ బాలికల హాస్టల్లో 20 మందికి పైగా బాలికలు ఉన్నారు. వర్షం వచ్చినప్పుడు స్లాబ్‌పైన పెచ్చులూడడంతో వర్షపు నీరంతా ఉరుస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బాలికలు భయాందోళన చెందుతున్నారు. హాస్టల్లో ఉన్న ఫ్యాన్‌లు కూడా తిరగకపోవడంతో దోమల సమస్య అధికంగా ఉంది. టాయ్‌లెట్లు పాచిపట్టి అధ్వాన పరిస్థితుల్లో ఉంది. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులకు వేస్తున్న భోజనం కుడా నాణ్యత లేకుండా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. సంబంధిత అధికారులు హాస్టల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.



హాస్టల్‌లో పెచ్చులూడిన దృశ్యం

మురుగుతో అవస్థలు

- రహదారి పైనే మురుగునీరు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

గంగాధరనెల్లూరు: నివాస ప్రాంతంలోనే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. స్థానికులు నివాసాల నుండి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపైకి వస్తోంది. కొందరు ప్రజలు ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. అయితే భూగర్భంలోకి ఈ నీళ్లు ఇంకక పోవడంతో రోడ్డుపైకి వస్తున్నాయి. గతంలో స్థానికులు అధికారులకు పంచాయతీ వారికి తెలిపారు. వారు వచ్చి పరిశీలించి డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎలాంటి కాలువ నిర్మాణం చేపట్టలేదు. గృహ యజమానులు పాత్రలు, దుస్తులు ఉతికే నీరు సైతం రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గృహాల వారు, పాదచారులు నడిచేందుకు సమస్యగా మారింది, ఈ మురుగు నీరు కారణంగా దుర్వాసన వస్తోంది. దీనిపై సంబంధిత అధికారుల స్పందించి మురుగునీరు రోడ్డుపై పారకుండా డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విన్నవించుకుంటున్నారు. ఈ సమస్యతో దాదాపు 40 కుటుంబాలవారు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో తూగుండ్రం పంచాయతీకి పైలెట్ ప్రాజెక్టు కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఓ ప్రజా ప్రతినిధి కాంట్రాక్టు దక్కించుకొని పనులు పూర్తి చేయలేదు. పనులు నిలిపేయడంతో ఆ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదు.



రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అధికారులు పట్టించుకోవడం లేదు



తూగుండ్రం గ్రామంలో మేం నివశించే వీధిలో గత కొద్ది సంవత్సరాలుగా ఈ సమస్య ఉంది. నిరంతర సమస్యగా మారింది. ఈ సమస్యకు సంబంధించి అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. అయినా ఎలాంటి పరిష్కారం లేదు. డ్రైనేజీ సమస్యలను ఎంత త్వరగా పరిష్కరిస్తే అంత మంచిది. స్థానికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం అపరిశుభ్రంగా మారి వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉంది. – శేఖర్ రెడ్డి, తూగుండ్రం గ్రామం

సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మాట వాస్తవమే. సంబంధిత విషయాన్ని అధికారులకు తెలిపి, వారి ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తాం. స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– మురళి, పంచాయతీ కార్యదర్శి